
ఎలైట్ స్పైన్ అండ్ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రకాష్

దిల్‌సుఖ్‌నగర్‌లో ఎలైట్ స్పైన్ అండ్ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎలైట్ స్పైన్ అండ్ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్ తన రెండో బ్రాంచ్‌ను నిర్వాహకులు దిల్‌సుఖ్‌నగర్‌లో గురువారం ప్రారంభించారు. తక్కువ వ్యయంతో, అందరికి అందుబాటులో ఉండే విధంగా అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తామని సీనియర్ ఇంటర్నేషనల్ పెయిన్ ఫిజిషియన్ డాక్టర్ ప్రకాష్ గుడిపూడి తెలిపారు. నగరంలోని తూర్పు ప్రాంతాలైన మలక్‌పేట, అంబర్‌పేట, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్ ప్రజలతో పాటు నల్గొండ, ఖమ్మం ప్రాంతాలకు ఈ సెంటర్ చేరువగా ఉంటుందన్నారు. మణికొండలో ఏర్పాటు చేసిన తమ సెంటర్‌లో ఇప్పటి వరకు 25వేల చికిత్సలు చేయడం అరుదైన రికార్డుగా ఆయన చెప్పారు. దీర్ఘకాలిక నొప్పుల కోసం ప్లాస్మా రీజనరేటివ్ థెరపీ వంటి ఆధునిక పద్ధతులను అందిస్తున్నామని దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్ డైరెక్టర్ అండ్ క్లినికల్ హెడ్ డాక్టర్ మోహన్ తెలిపారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరి చూపు బీజేపీ వైపు

● రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరి చూపు బీజేపీ వైపు ఉందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో శుక్రవారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన డివిజన్ స్థాయి బూత్ కమిటీ అధ్యక్షులు, బూత్ కో-ఆర్డినేటర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బూత్ కో-ఆర్డినేటర్లు సద్ది సందీప్‌రెడ్డి, లింగాల దశరథ్‌గౌడ్, సుంకరి రమేష్‌గౌడ్, గూడూరు అవినాష్‌రెడ్డి, పాశం శ్రీశైలం, బానుక రమేష్, యోగిరాజ్, కృపాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, జయవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ, రథోత్సవాలు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటసింగారంలో మద్విరాట్ పోతులూరీ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ, రథోత్సవాలు శుక్రవారం విఘ్నేశ్వరపూజ, మహాభిషేకంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. 13న ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 11.15గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 14న ఉదయం 5గంటలకు దిష్టికుంభం, 5.30గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం, 9గంటలకు పోలేరమ్మ బోనాలు ఉంటాయని తెలిపారు.

భగవద్గీత పఠన ఉచిత శిక్షణ శిబిరం

వనస్థలిపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, వనస్థలిపురం భక్త సమాజం సంయుక్త నిర్వహణలో భగవద్గీత పఠన- ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షుడు సీ.హెచ్.వీ. ఆర్.కే మూర్తి తెలిపారు. ఏప్రిల్ 23 నుంచి మే 9వరకు వేసవి సెలవుల్లో 14 సంవత్సరాలు పైబడిన విద్యార్థులు, గృహిణులు, యువకులు, పెద్దవారు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. ప్రతి రోజు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు వనస్థలిపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఏప్రిల్ 20తేదిలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు. 7801001166, 9247836302, 8919416798లలో సంప్రదించాలని ఆయన కోరారు.


విజయలక్ష్మికి నియామక పత్రం అందజేస్తున్న సబితారెడ్డి

బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి

సరూర్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ఉపాధ్యక్షురాలిగా మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన మాజీ వార్డు సభ్యురాలు, పార్టీ సీనియర్ నాయకురాలు పాలపర్తి విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ మంత్రి పి.సబితారెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో చేవెళ్లలో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు.

రేపు అయ్యప్పస్వామి విసుకాని ఫెస్టివల్

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని అయ్యప్పస్వామి ఆలయంలో పంచగిరివాస అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం విసుకాని ఫెస్టివల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసందర్భంగా ఉదయం 6గంటలకు గణపతి హోమం, 7గంటలకు అష్టాభిషేకం, సాయంత్రం దీపారాధన, హరివరాసనం కార్యక్రమాలు జరగనున్నాయి. అయ్యప్పస్వామి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ఇండియన్ పీనల్ కోడ్ పుస్తకాలు విడుదల

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఇండియన్ పీనల్ కోడ్ పుస్తకాలను శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొండల్‌రెడ్డి, మాధవరెడ్డి విడుదల చేశారు. ఇండియన్ పీనల్ కోడ్ ఎవిడెన్స్‌యాక్ట్, సీపీసీ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ పుస్తకాలను ఈ సందర్భంగా విడుదల చేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో 'చెత్త' మంటలు



పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ 20వ వార్డు పరిధిలో రోడ్డు పక్కన ఉన్న ఓ కమ్యూనిటీ శ్మశాన వాటికలో మున్సిపాలిటీ చెత్తను డంప్ చేస్తున్నారు. డంప్ చేసిన చెత్తను అక్కడే తగులబెడుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తగలబడుతున్న సమయంలో దట్టమైన పొగ కమ్ముకుంటున్నది. ఆ పొగ నుంచి విషవాయువులు వెలువడుతుండడంతో రోడ్డున వెళ్తున్న వాహనదారులతో పాటు సమీపంలోని కాలనీ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నదని పలువురు పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి

అటకెక్కిన ఇంకుడుగుంతల నిర్వహణ

● ఇప్పటికే అడుగంటిన భూగర్భ జలాలు
● చోద్యం చూస్తున్న యంత్రాంగం



భానునగర్‌లో చెత్త, వ్యర్థాలతో కూరుకుపోయిన ఇంకుడుగుంత


సరస్వతీనగర్ కాలనీలో ఆనవాళ్లు కోల్పోయిన ఇంకుడుగుంత

సైదాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నేలను తాకే ప్రతి చినుకు ఇంకితే భూగర్భ జలం పెరుగుతుంది. కరువు కాలం వచ్చినా నీటి కష్టం తెలియనివ్వదు. ఇందుకు చక్కటి మార్గం ఇంకుడు గుంతల తవ్వకం. కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగరంలో నీటిని పొదుపు చేసి భూగర్భ జలాలను పెంపొందించే పనులు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో భవిష్యత్‌లో నీటి జాడ మృగ్యమయ్యే పరిస్థితులు దాపురించే అవకాశాలు ఉన్నాయి. మలక్‌పేట, యాకుత్‌పురా, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల పరిధిలోని ప్రాంతాల్లో వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించడంలో నిర్లక్ష్యం నెలకొంది. 2018లో ప్రభుత్వం చేపట్టిన జలం- జీవం కార్యక్రమంలో పెద్దఎత్తున ఇళ్లలో, కాలనీలు, కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేశారు. కానీ ఇంకుడు గుంతల నిర్వహణను ఆరేళ్లుగా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. ఈ ఆరేళ్లుగా ఇంకుడుగుంతల ఏర్పాటు పూర్తిగా మరిచిపోయారు. వర్షపు నీరు డ్రైనేజీ పాలవడంతో భూగర్భ జలమట్టం పాతాళంలోకి పడిపోయింది. ప్రధానంగా జీహెచ్ఎంసీ, జలమండలి ఆధ్వర్యంలో ప్రతి ఏటా వీటిని ఏర్పాటు చేయడంతో పాటు ఇది వరకే ఉన్న వాటిని శుభ్రం చేయాల్సి ఉంది. కానీ ఏళ్లు గడిచిపోతున్నా వాటిపై చర్యలు తీసుకునేవారు కరువయ్యారు. దరిమిలా భూగర్భజలాల మట్టాన్ని పెంచాలనే ఆశయమే నీరుగారిపోతున్నది. రానున్న వర్షాకాలం నాటికైనా ఇంకుడుగుంతల మరమ్మతులు చేపట్టి వర్షపు నీరు వృథా కాకుండా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెరగనున్న భూగర్భ జలాలు

ఒక క్యూబిక్ మీటరు గుంతలో వెయ్యి లీటర్ల నీటిని ఇంకించవచ్చని నిపుణులు చెబుతుండగా ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణంతో 2,592 లీటర్ల నీరు భూమిలో ఇంకుతుంది. ప్రతి ఇంటా నిర్మాణం చేపట్టినట్టయితే లక్షల లీటర్ల నీటిని భూమిలోకి పంపించి భూగర్భ జలాలు పడిపోకుండా నిలువరించుకునే వీలుంది. గతంలో సామూహికంగా నిర్మాణాలు చేపట్టినా నిర్వహణ లేక కూరుకుపోయాయి. 300 నుంచి 400 అడుగుల లోతు బోర్ల నుంచి వచ్చే నీటిలో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు ఉండే అవకాశాలు ఉన్నందున భూగర్భ జలాలు పెంచాల్సిన అవసరముంది. ఫలితంగా స్వచ్ఛమైన తాగునీరు లభించే అవకాశముంది.

కొత్త వాటి ఊసే లేదు..

గతంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు తమ పరిధిలో గుర్తించిన చోట ఇంకుడు గుంతల ఏర్పాటులో కాలనీవాసులను భాగస్వాములను చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించేవారు. కాలనీల్లో, రోడ్ల పక్కన బహిరంగ ప్రదేశాలలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేస్తే 70శాతం, సొంత ఇంట్లో ఏర్పాటు చేసుకుంటే 50శాతం వ్యయాన్ని భరించేది. కానీ ఈ పథకాన్ని పూర్తిగా అటకెక్కించారనే విమర్శలు ఉన్నాయి.

నిర్వహణ గాలికి వదిలేశారు



పలు కాలనీల్లోని బహిరంగ ప్రదేశాలలో నిర్మించిన ఇంకుడుగుంతల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. చాలా గుంతలు నిరుపయోగంగా మారగా, మరి కొన్ని శిథిలావస్థకు చేరాయి. ప్రతి అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతి ఇచ్చినప్పుడు విస్తీర్ణాన్ని బట్టి రెండు నుంచి నాలుగు ఇంకుడుగుంతలు నిర్మించాల్సి ఉంది. కానీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇంకుడుగుంతల నిర్మాణం నామమాత్రంగా ఉంది.

- మడిగల విజయభాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడు, ఏపీఏయూ కాలనీ సంక్షేమ సంఘం

నీటి పొదుపునకు విస్తృతంగా ప్రచారం చేయాలి



ముఖ్యంగా గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టినా ప్రస్తుతం వాటి నిర్వహణ లేక కూరుకుపోయాయి. నీటి పొదుపునకు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. కొత్త ఇళ్ల నిర్మాణాల్లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేస్తే అనుమతి ఇవ్వాలనేది ప్రభుత్వ నిబంధన, అయితే సక్రమంగా అమలు కావడం లేదు.

- వీరేందర్‌యాదవ్, లక్ష్మినగర్‌కాలనీ

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మొదలైన కరెంటు, నీటి కష్టాలు

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే కరెంటు, నీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని లింగోజిగూడ, చంపాపేట, హస్తినాపురం డివిజన్ల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో జరిగింది. ఈ సమ్మేళనంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలతో కలిసి సుధీర్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు కష్టాలు మొదలవడంతో మూలకేసిన ఇన్వర్టర్లు, జనరేటర్లు మళ్లీ బయటకు తీయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి కార్యకర్త తానే అభ్యర్థిని అన్న భావనతో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలని అభ్యర్థించాలన్నారు. ప్రభుత్వ పాలన పట్ల విసిగెత్తిన ప్రజలు రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడం తథ్యమని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇరువురూ బయటివారని ఆయన చెప్పారు. ఈ సమ్మేళనంలో మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, పద్మానాయక్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వరప్రసాద్‌రెడ్డి, రాజిరెడ్డి, సత్యంచారి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, గజ్జల మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.



మలక్‌పేటకు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు కె.శివమ్మ శుక్రవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

- చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి


ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో జరిగిన కార్యక్రమంలో జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిపో మేనేజర్ హరి, ఎస్ఎంయూ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ సత్యం తదితరులు - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి


చేవెళ్ల లోక్‌సభ బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలలో ఇంటింటికీ తిరిగి దేశం కోసం, ధర్మం కోసం బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజన్‌కుమార్, సాతెళ్లి సాయి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

ఉద్రిక్తతకు దారితీసిన దిమ్మె కూల్చివేత


దిమ్మెను కూల్చివేస్తున్న అధికారులు

హయత్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం నిర్మించిన దిమ్మెను హయత్‌నగర్ మండల రెవెన్యూ, ఎల్‌బీనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేశారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. గత సంవత్సరం మన్సూరాబాద్ డివిజన్‌లోని హయత్‌నగర్ వీరన్నగుట్ట కాలనీలో కమ్యూనిటీ హాల్ సమీపంలోని పార్కు స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కాలనీ ప్రజలందరి ఆమోదంతోనే అక్కడ విగ్రహం ఏర్పాటుకు తీర్మానించి స్థలం వదిలి పెట్టారు. అందులో భాగంగా స్థానిక అంబేడ్కర్ సంఘం నాయకులు గురువారం రాత్రి దిమ్మెను నిర్మించారు. గుర్తు తెలియని వ్యక్తులు జీహెచ్ఎంసీ, హయత్‌నగర్ మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు శుక్రవారం ఉదయం పోలీస్ బందోబస్తుతో అక్కడకు వెళ్లి ఎక్స్‌కవేటర్‌తో దిమ్మెను కూల్చివేశారు. దీంతో స్థానిక అంబేడ్కర్ సంఘం నాయకులు అడ్డుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. కాలనీ ప్రజలందరి ఆమోదంతోనే అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గత సంవత్సరం భూమి పూజ చేశామని పలువురు తెలిపారు. అందులో భాగంగానే దిమ్మెను నిర్మించినట్లు సంఘం నాయకులు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉన్నందున..

ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహ యాదవ్, సీఐ రామకృష్ణ అంబేడ్కర్ సంఘం నాయకులకు సర్దిచెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి కూడా తీసుకుని ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఎవరు ఫిర్యాదు చేశారో చెప్పాలని అంబేడ్కర్ సంఘం నాయకులు అధికారులను ప్రశ్నించారు. అందుకు వారు నిరాకరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది శ్రీనివాస్, ఎస్ఐ నరసింహ, వీఆర్ఏ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడ కాలనీల్లో మినీ బస్సులను ప్రవేశపెట్టండి

● మంత్రి పొన్నంకు యూత్ కాంగ్రెస్ నేత బోయపల్లి వినతి


మంత్రి పొన్నంను కలిసిన రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ డివిజన్లలో గల కాలనీల్లో నివసించే వారు సరైన రవాణా వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ దృష్ట్యా వారి సౌకర్యార్థం మినీ బస్సులు ప్రవేశపెట్టాలని యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. శుక్రవారం ఆయన పొన్నంను మర్యాదపూర్వకంగా కలిసి, అనంతరం రవాణా వసతులపై వినతి పత్రం అందజేశారు. ప్రధాన రోడ్లపై మాత్రమే తిరిగే బస్సులను వినియోగించుకోవడం కాలనీలవాసులకు కష్టసాధ్యంగా మారిందని, రోడ్లకు దూరంగా ఉండే నివాస గృహాల ప్రయాణికులు బస్సుల కోసం పడరాని పాట్లు పడుతున్నారని ఈ సందర్భంగా ఆయన మంత్రి పొన్నంకు వివరించారు. కాలనీల్లోని అంతర్గత రహదారులపై మినీ బస్సులను తిప్పితే స్థానికులకు సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన అన్నారు. దీనికి మంత్రి పొన్నం సానుకూలంగా స్పందిస్తూ ఆర్టీసీ అధికారులతో చర్చించి, రూట్ మ్యాప్ తయారు చేయించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి


నర్సింహ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మెడ్చల్ జిల్లా చర్లపల్లికి చెందిన గుల్లం నర్సింహ (80) చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ మార్గమధ్యలో రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని బలమైన గాయాలతో పడి ఉండగా, స్థానికులు వైద్యపరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మరణించాడని రైల్వే పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేటి నుంచి సీతారామ భక్తాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

● 17న సీతారాముల కల్యాణ మహోత్సవం


ఉత్సవాలకు ముస్తాబైన సీతారామ భక్తాంజనేయ స్వామి ఆలయం

సరూర్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ కింది వార్డులో గల విశ్వక్సేన(గణపతి) సమేత సీతారామ భక్తాంజనేయస్వామి ఆలయం అష్టమ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఇక్కడ నేటి(శనివారం) నుంచి ఈ నెల 18వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించడానికి ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన నిర్వాహకులు.. భక్తులకు అవసరమైన వసతులు కల్పించడంలో నిమగ్నమయ్యారు.

నేడు అంకురార్పణ

ఆరు రోజుల పాటు కొనసాగనున్న అష్టమ బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం 5గంటలకు విశ్వక్సేనారాధనతో అంకురార్పణ చేయనున్నారు. అనంతరం రాత్రిదాకా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, మరుసటి రోజు తెల్లవారుజామున సుప్రభాతంతో కార్యక్రమాలను మొదలుపెట్టనున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రందాకా రోజువారీ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, సాయంత్రం 7గంటలకు హనుమత్ వాహనసేవ నిర్వహించనున్నారు. ఇక సోమవారం సైతం రోజువారి కార్యక్రమాల అనంతరం సాయంత్రం 7గంటలకు గరుడసేవ నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 7గంటలకు స్వామివారి ఎదుర్కోళ్ల ఉత్సవం నిర్వహించి, బుధవారం శ్రీరామనవమి రోజు ఉదయం 11గంటలకు సీతారామచంద్ర స్వామి వారి తిరు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అదే రోజు రాత్రి స్వామి వారి రథోత్సవం సైతం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. శ్రీరామనవమి రోజు మధ్యాహ్నం తోట యెట్టారెడ్డి గార్డెన్స్ వారి సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చివరి రోజైన గురువారం మహా పూర్ణాహుతి, శతఘటాభిషేకం నిర్వహించి ఆశీర్వాదములు, మంగళశాసనములతో ఉత్సవ సమాప్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.

చేవెళ్ల ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేద్దాం

● బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ


మాట్లాడుతున్న అరవింద్‌శర్మ

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలిపిద్దామని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పిలుపునిచ్చారు. చేవెళ్లలో శనివారం జరుగనున్న ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయడానికి శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని గ్రీన్‌హిల్స్‌కాలనీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ హక్కుల కోసం పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక వినిపించాలంటే చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేసి ప్రస్తుతం ఇబ్బందుల పాలవుతున్నారని ఆయన చెప్పారు. ప్రజలను ఇబ్బందుల నుంచి బయటపడేయాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నాయకులు న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొంద్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, శ్రీమన్నారాయణ, దుబ్బాక శేఖర్, రమేష్, పాషా, శ్రీకాంత్‌గౌడ్, కుమార్, మహేందర్, సోమన్న పాల్గొన్నారు.